# మానవత్వం

భయపడకు, భయపడకు. ఎదుర్కో చావుని. నీకు తెలుసు, ఇంకో నిమిషంలో నువ్వు చచ్చిపోతావని. అదుగో, నువ్వు మాలాగ మాటల్లో చెప్పలేకపోయినా వణుకుతూ, దేహాన్ని ముడుచుకొని బాధపడుతున్నావు. నిన్ను బంధించిన కాస్తా ఇనుప ఆవరణలో ఇటూ అటూ పరవళ్ళు తొక్కుతున్నావు. దూరదూరంగా చుట్టూ నిలబడ్డ మా అందరి వేపూ దీనంగా జాలిగా అసహాయంగా చూస్తున్నావు. నీళ్ళు కమ్మేనీ కళ్ళతో పిలుస్తున్నావు; ప్రార్థిస్తున్నావు. ప్రాధేయపడుతున్నావు. తోక ముడుచుకొని మోకాళ్ళబడి నీ పరాజయాన్ని వప్పుకొంటున్నావు. అయినా నువ్వు చావక తప్పదు.

ఏడవకు, ఏడవకు. ఛాతీ విరిచి నుంచో. ధైర్యంగా గుండు దెబ్బకి నీ ప్రాణాన్ని బలియియ్యి. నువ్వు ఎంతయిదయినా మరి బ్రతకలేవు మేము-మనుష్యులం నిన్ను బ్రతకనివ్వం అంటున్నావు. అదుగో నీకోపాన్ని ప్రదర్శిస్తున్నావు. వాళ్ళు మనుష్యులా! అని. అవును. మేము మనుష్యులలో జమకాదు. దండుపిల్లలం. రాతిగుండెలం. నువ్వేకాదు మా అంతరాత్మలే మమ్మల్ని శపిస్తాయి. శకిస్తాయి. నిందిస్తాయి.

ఇదిగో, వస్తున్నారు నిన్ను పేల్చిచంపేవాళ్ళు. గుళ్ళు తెచ్చుకొని వస్తున్నారు. వాళ్ళని తిట్టకు. అది వాళ్ళపని. అధికారుల ఆజ్ఞ. వాళ్ళకీ నిన్ను చంపేయాలని లేదు. అందులో ఒక నీ లాంటి విశ్వాసపాత్రమైన ఆటకాడు వుండకపోడు. వాడు

తనకి తోడుగా నీజాతిప్రాణితో బాల్యాన్నిగడిపే ఉంటాడు. తన చిన్నతనంలో తన నేస్తానికి ఎవరేనా అపాయాన్ని చేస్తే ఏడ్చిఏడ్చి భోజనాన్నికూడా మానిఉంటాడు. బడికిపెళ్ళక అల్లరి పెట్టివుంటాడు. అమ్మతోఅలిగి ఉంటాడు. తండ్రిచేత దెబ్బలు తినిఉంటాడు. ఇవన్నీ నీజాతి జీవి అయినవాడి బాల్యస్నేహితుడికోసమే.

నిన్ను పేల్చిచంపేసేముందర నిన్నుకాల్చేవాడికి ఇవన్నీ మనస్సులో లేకపోవచ్చు. అధికారులు ఫలానావాడు ఇవాళ నిన్నుచంపేయాలని ఆజ్ఞాపించినపుడు, వాడివళ్ళు కొంచెంపులకరించి వుండాలి. తనకు గురిచూసికొట్టేందుకు 'తుపాకితప్పితం'లో అవకాశాలుహెచ్చుగా దొరుకుతున్నాయని సంబరపడవచ్చు. అయినా నిన్ను చంపేశాక నీగురించి రాత్రంతా కలలుకనకమానడు. తనబాల్యంలో నీలాటిప్రాణులతో ఆడుకొన్నరోజులు జ్ఞాపకంతెచ్చుకోక తీరదు.

వచ్చేరు యమకింకరులని అంటున్నావుకదూ! అవును. నీకు మా అందరిమీదా ఎంతోకోపంవుంది. వీలవుతే కరచిభంగున (మా విమానాల్లాగ) ఎగిరి తప్పించుకుపోదామని ఉంది. నిజమే. ప్రాణులందరికీ బతికిబయటపడుదామనే ఇష్టిం ట్ట ఉండక తప్పదు. అయితే మేమువెర్రివాళ్ళమా? నిన్నుయినపకటకాటాలకవతల భద్రంగానించోబెట్టి నువ్వెలాగా తప్పించుకోకుండావేళాం?

ప్రశ్నిస్తున్నావా? అడుగు. చెప్తాను. ప్రాణంతీసేసేముందర నేరగాడిఆఖరికోరిక నెరవేర్చాలి. నువ్వూ ప్రాణివే. అడుగు నీసందేహం. నువ్వుచేసినతప్పేమిటని అడుగుతున్నావు.

నువ్వుకుక్కగా పుట్టే వనికాదు నీనేరం. నువ్వు ఎవడి సొత్తువీ కావనే. నువ్వు ఈ లోకంలో బతికేందికి ఒకడిఅధీనం లో ఉండాలి. ఒకడికి విశ్వాసంగా పనిచేస్తూ వుండాలి. వాడి ఇంటికి గస్తీతిరుగుతూఉండాలి. వాడిఇంట్లో దొంగలుపడితే అరిచి అందరినీ మేలుకొల్పి దొంగల్ని కరిచి పారిపోకుండా నించోపెట్టేయాలి. అలా పనికిరాదు. స్వేచ్ఛగావుంటాను. నా యిష్టమొచ్చినట్టు తిరుగుతాను. పారేసిన ఎంగిలిఆకులు నాకి రోడ్డుప్రక్కగొయ్యి తవ్వుకు పడుకుంటాను అంటే వప్పుకోం. నువ్వుపట్టణంలో బతుకుదామని అనుకుంటే తప్పనిసరిగా ఒకడి ఆదాలో ఉండాలి. తెలుసా.

ఇక రెండోది. నువ్వు ఎవడిసొమ్మువీకాక లైసెన్సు లేకుండా బతకడమే కాకుండా మా విమానమైదానంలోకి వచ్చావు. అదే ముఖ్యమైన తప్పు. మా సరిహద్దులలోకి వచ్చావు కాబట్టే మేము నిన్ను చంపుతున్నాం. లేకపోతే నీసంగతి మునిసిపాలిటీవారే చూసుకొంటారు. నువ్వుచేసిన నేరమే అంత. మనుష్యులం మేమే 'పాసు' లేకుండా ఈ ప్రదేశంలోకి రాకూడదు. అలాంటిది కుక్కవి నువ్వు ఎలా రాగలవు. అదీగాక నువ్వు ఎవరిహక్కువీ కాకుండా బతుకు తున్నావు!

మరి మనం మాట్లాడుకొందికి వీల్లేదు. నీ సందేహాలు నివృత్తి కాకముందే నువ్వు చచ్చిపోవాలి. మానవుడి గురించి నువ్వుతెలుసుకోకు. వాడు నీకు పాపాత్ముడే కావచ్చు.

వాడిలాంటి కుక్కల్ని నీజన్మలో చూడకపోవచ్చు. రడీ, నించో. యెటెన్షన్.

అనకు. శరణనకు. నేను ఏం చేయలేను. వచ్చేరు, నిన్ను గురిపెడుతున్నారు. అలా చూడబోకు. కదలకు. ఒక్క దెబ్బతో నీ ప్రాణాన్ని పోగొట్టుకో. మరోమాట- నువ్వు నిశ్చలంగా నించుంటే ఒకగుండుతో నీప్రాణం పోగొట్టు కుంటే మాకు గొప్ప. మేమంతా మొనగాళ్ళం. గురిచూసి కొట్టగలం అని ఛాతీ విరుచుకొని తిరగ్గలం. లేదా నువ్వు ఇటు పరుగెత్తి అటుపరుగెత్తి మమ్మల్ని యిబ్బందిపెట్టావా, నీకే కష్టం. వక్కదెబ్బతో నీప్రాణం పోదు. తీసుకొని చావాలి నువ్వు

ఇలా విను ఇంకోక్షణానికి నువ్వీ లోకంలో ఈ దేహంలో ఉండవు. నీ ప్రాణం ఎగిరిపోతుంది. అంతమాత్రాన భయపడకు. నువ్వు మాలాగ చదువుకోలేదు కాబట్టి నీకు తెలీదు. గానీ, శక్తిని చంపలేం అని ఒకసూత్ర ముంది. ప్రాణం ఒక శక్తి. అంచేత నీ ప్రాణాన్ని మేం చంపలేము. నువ్వు ఈ కుక్కరూపంలో లేకపోతే నీ ప్రాణశక్తి మరో రూపంలో ఉంటుంది. అంచేత నీ ప్రాణాని కేం లోటూ లేదు. నువ్వు ఈ తోలులోంచి యెగిరి పోయాక నీ దేహం కుళ్ళి కుళ్ళి ఎముకలక్రింద విభజింపబడి భూమిలో కలిసిపోతుంది. ఫరవాలేదు. మనిషన్న తరువాత - క్షమించు. ప్రాణన్నాక చావక తప్పదు. రేపో నేడో మనమంతా పోవలసినవాళ్ళమే.

ట్రిగ్గర్ మీద చూపుడువ్రేలు పెట్టేడు. ఎడంకన్ను మూసుకొని కుడికన్నుతో నీ ప్రాణాన్ని చూస్తున్నాడు. గురిపెట్టి వదలుతున్నాడు. వస్తున్నాది. వేగంగా వెళిపోస్తున్నాది. నీ ప్రాణశక్తిని దేహంనుండి విడిపించే మహాశక్తి వెళిపోస్తున్నాది. కవాటాలని తెరచుకుంటున్నాయి నీ ప్రాణాలు. పేలింది తుపాకీ.

మా చెవులు చిల్లులుపడేటట్లు గుండువచ్చింది. చచ్చిపోయేవు నువ్వు. నీ ప్రాణం ఎగిరిపోయింది. నీదేహం కిందపడిపోయింది. ఇదిగో నీ ప్రాణం యెగిరి యెగిరి నాభుజంమీద వాలింది. నీ సందేహాలను తీర్చుకుందికి ఇదికాదు సమయం. అయినా నీకోసం నాకాలాన్ని నేను తీసుబాటుకిందకిమార్చుకొంటున్నాను.

నువ్వు యికమీదట పిల్లిగా, పిచ్చిగ్గా, చీమగా, చేపగా, మనిషిగా, మానుగా ఏరూపంలోనైనా పుట్టవచ్చు. అయితే నువ్వు మానవుడిగా జన్మించకు; నీకు అప్పుడే మామీద కోపం పుట్టి, ఆకోపం అసయ్యంగా మారుతున్నదని నీకు తెలుసు అవును వెధవబతుకు మనిషిబతుకు.

ఇచ్చేడు దేముడు మెదడు. ఏంలాభం! మృగాలకన్నా కనాకష్టంగా బతుకుతున్నాము. మనిషికీ మనిషికీ దేశాభేదాలూ, జాతివైషమ్యాలూ, మతకలహాలూ, కుట్రలూ, కుత్సితాలూ, యుద్ధాలు యుద్ధాలు.

ఎవడో ఒకడే మామీది అధికారి. వాడూ మనిషే. అయితే వాడి అడుగులకి మడుగులొత్తుతూ వాడికిందమనాలి.

రైతున్నాను. పొలందున్ని కష్టపడితే వాడికి తిండుండదు. పనివాడు చెమటోడ్చి దేశానికంతా సామానులు చేస్తాడు. కానీ వాడికి ఓగుడ్డ ఓగుడిశా అనేవి వుండవు. ఏం చెప్ప-

బతకడం ఎంతకష్టం? అందులోకీ స్వేచ్ఛగా నీఅభిప్రాయాల్ని నువ్వు వెలిబుచ్చకూడదు. నువ్వు సంఘవిరోధివి. అంటే వాళ్ళకి నువ్వు ఆటంకానివి. నీలాంటి పురుగులు కొంతమంది ఉండి మీబలం తక్కువైతే మీరంతా చావక తప్పదు. మీబలమే హెచ్చయితే మీ అభిప్రాయాలతో ఏకీభవించనివాళ్ళని మీరు చంపేస్తారు. బతికిందికి భయం పుట్టదూ?

లేదులే, ఇదొకతరహా బతుకు. పుట్టు. మనిషిగానే పుట్టు. ఇంతఅవకాశాలూ అన్నంవున్న కుటుంబంలోనే పుట్టు. చదివి నేలను దున్ను. మంచిఉద్దేశాలనే జల్లు పరిస్థితులకి లొంగక, ఆశయాలని విడిచిపెట్టక, పిడికిలిపట్టి, ఆటంకాలని ఎదుర్కో. ఈమానవులని విడిపించు. ఈ కష్టాలని చీల్చు. ఈయెండకి గొడుగుపట్టు. మనుష్యులలో దీపంవెలిగించు.

నువ్వు మగకుక్కవో ఆడకుక్కవో తెలీదు. ఐనా నువ్వు నీజీవితంలో ప్రకృతి నీకు నియమించిన పనిని చేసే ఉంటావు. నీజాతి చచ్చిపోకుండా ఉండింది కనుక నీచేతనయిన సహాయంచేసి ఉంటావని నాఉద్దేశం. అదీగాక మనుష్యులలో నయితేనేం, మృగాలలో నయితేనేం- ప్రకృతికి సహాయం చేద్దామనికాదు, సంతతిని కనడం! వాంఛ! వాంఛ!

మనుష్యులకి మాకే మేంచేయబోతున్న చేస్తున్న మహా యజ్ఞపు పవిత్రత ఆవేళల్లో బుర్రలో లేనప్పుడు పశువులకి మీకేండుంటుంది. మాకూ ఉన్నాయిలే సామెతలు 'శృగాల కన్నా నీచంగా' అనీ 'పశువాంఛ' అనీ అనేకం.

ఏదో నాలుగు జీవుల్నినువ్వుపట్టించేక నువ్వు కనబడ్డ ఆడకుక్కల వెనకా, మగకుక్కల పక్కా తిరిగివుంటావు. అశుద్ధాన్ని కతికి, గజ్జీ, పుళ్ళూ, పేలూ పట్టించుకొని మీ యజమానికి తలవంపుగా తిరిగివుంటావు. అందుకనే యజమాని నిన్ను వదిలేసిందికి కారణం. నీకు తొలి దగ్గర్నుండి యజమానెవడూ లేకపోయింది నేను ఊహించలేను.

నువ్వు బహుశా ఆడకుక్కవా? నీఅందమైన దేహం, నీజోతులు మెరిసేకళ్ళూ, నువ్వు గాలికిపుట్టి, ధూళికి పెరిగిన కుక్కవు కావని చెబుతున్నాయి. ఏమయినా, ఎన్ననుకొన్నా ఏంలాభం? నువ్వు ఎవడిహక్కువీ కాకుండా తిరిగేవు. నీచితి నువ్వే పేర్చుకున్నావు.

నీదేహాన్ని పారేస్తా. నీమాంసాన్ని గెద్దలూ కాకులూ పొడుచుకు తింటాయి. నీజాతివాళ్ళు వచ్చిందికి నీస్మశానముంటే వాళ్లు చుట్టూచేరి ఏడుస్తారు. లేదా ఎవరూ ఏడవకుండానే నీదేహం భూమిలో కలుస్తుంది. అయినా ఏం యిదవకు. నీకూ నీదేహానికీ ఏం సంబంధం లేదు.

ఫరవాలేదు. నువ్వు కుక్కవయినా నీకు గోరీకడుతున్నాను. యిదుగో నాగుండెల్లోనే. నాభావనలో నీదేహాన్ని

భద్రంగా నాపాటల తైలాల్లో పెట్టి కాపాడుతా. నీసమాధిపై బైబిలులో నాలుగుపాదాలను తీసి శిల్పంచెక్కుతాను. నేను ఇంతో అంతో కవిని. నీమీద పాటలురాసి నాలుగు పత్రికలలోనూ ప్రకటిస్తాను.

నేను మధన పడిందికి నువ్వుకారణ మయేవు. నీవల్లే నాలోఏవో ఆలోచన ద్వారాలు తెరుచుకొన్నాయి. అదే చాలు నాకు. అందుకే నీకు నాపూజ.